క్లుప్తంగా

సుబ్బారాయుడికి అభిషేకాలు



ముదినేపల్లి రూరల్: ప్రసిద్ధి చెందిన సింగరాయపాలెం–చేవూరుపాలెం సెంటర్లోని శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో స్వామికి మంగళవారం అభిషేకాలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు తోలేటి వీరభద్రశర్మ ఆధ్వర్యంలో స్వామికి ప్రత్యేక పూజలు జరిపారు. అభిషేకాలు చేయించుకునేందుకు సుదూర ప్రాంతాల నుంచి అనేకమంది భక్తులు ఆలయానికి చేరుకున్నారు. స్వామివారి పుట్టలో పాలు పోసి, నాగబంధాల వద్ద పూజలు చేశారు. భక్తుల రద్దీకి అనుగుణంగా నిత్యాన్నదాన ప్రసాదానికి సంబంధించి అధికారులు ఏర్పాట్లు చేశారు. ఆలయ ఈఓ ఆర్ గంగాశ్రీదేవి పర్యవేక్షణ చేశారు.

‘ఆర్‌ఎంపీల సమస్యపై చర్చిస్తాం’



గుడివాడ టౌన్: గ్రామీణ వైద్య చట్టంపై అసెంబ్లీ సమావేశాల్లో ప్రస్తావించి చర్చ జరుపుతామని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. మంగళవారం ఆయన నివాసంలో గుడివాడ నియోజకవర్గ ఆర్‌ఎంపీ, పీఎంపీల నాయకులు ఎమ్మెల్యేకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు ఇటీవల శ్రీశైలంలో జరిగిన ఆర్‌ఎంపీల ఆత్మీయ సమ్మేళనంలో తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతామని హామీ ఇచ్చారన్నారు. తమ సమస్యను అసెంబ్లీలో చర్చకు తీసురావాలని కోరారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే రాము మాట్లాడుతూ వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో దీనిపై చర్చిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బేసిక్ హెల్త్ మెడికల్ ప్రొవైడర్స్ అసోసియేషన్ (బీహెచ్‌ఎంపీఏ) ఉమ్మడి కృష్ణాజిల్లా అధ్యక్షుడు ఎస్. ఉదయ్‌భాస్కర్‌రాజు, ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్.ఉమాశంకర్, సంయుక్త కార్యదర్శి కె. వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వేసవిలో తస్మాత్ జాగ్రత్త



గుడ్లవల్లేరు: వేసవి వచ్చిందంటే చోరీలు అధికమవుతాయని ప్రజలంతా జాగ్రత్తగా ఉండాలని స్థానిక ఎస్ఐ ఎన్.వి.వి.సత్యనారాయణ అన్నారు. ఈ విషయమై మంగళవారం గుడ్లవల్లేరు మండలంలో మైక్ క్యాన్వాస్ చేయించారు. పిల్లలకు కాలేజీలు, స్కూల్స్ సెలవులు ఇవ్వడంతో బంధువుల ఇళ్లు, విహారయాత్రలకు వెళ్తుంటారని చెప్పారు. వేసవి తాపానికి తలుపులు పూర్తిగా వేయకుండా దగ్గరికి వేసుకుని ఆరుబయట పడుకోవటం, తలుపులు తెరిచి పడుకోవడం చేస్తుంటారని తెలిపారు. దీంతో చోరీలు చేసేవారికి ఆస్కారంగా మారుతుందన్నారు. దయచేసి ఎవరూ ఇంటికి సరైన రక్షణ లేకుండా ఎక్కడికీ వెళ్లకూడదని పేర్కొన్నారు. అలాగే ఊరు వెళ్లే ముందు పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు.

మజ్జిగ పంపిణీ



కలిదిండి(కైకలూరు): కలిదిండి మండలం కోరుకొల్లు వంతెన సెంటర్‌లో ఏర్పాటు చేసిన మజ్జిగ పంపిణీ కార్యక్రమం మంగళవారానికి 47వ రోజుకు చేరింది. గ్రామానికి చెందిన పేపకాయల నాగశ్రీను కుమార్తె ఆధ్య(ఎన్‌ఆర్‌ఐ) ఆర్థిక సాయంతో మజ్జిగ పంపిణీ చేశారు.

రేపు విగ్రహ ప్రతిష్ట

మండవల్లి: పెరికెగూడెంలో ఈనెల 8వ తేదీ ఉదయం 9.44 గంటలకు శ్రీ ఆదివినాయకస్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం జరుగుతుందని నిర్వాహకులు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 11 గంటల నుంచి అఖండ అన్నసమారాధన నిర్వహిస్తున్నామని, భక్తులు పాల్గొని కార్యక్రమాలను జయప్రదం చేయాలని కోరారు.

మెరుగైన వైద్యం కోసం ఏలూరుకు

కలిదిండి (కైకలూరు): రాష్ట్రీయ బాలల సంరక్షణా కార్యక్రమం(ఆర్‌బీఎస్‌కే) ద్వారా కలిదిండి పీహెచ్‌సీ పరిధిలో ఐదుగురు పాఠశాల విద్యార్థులను మెరుగైన వైద్యం కోసం ఏలూరు ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు కలిదిండి పీహెచ్‌సీ డాక్టర్ జాహ్నవి మంగళవారం తెలిపారు. ఆర్‌బీఎస్‌కే పథకం ద్వారా పీహెచ్‌సీ పరిధిలోని అన్ని పాఠశాలల్లో విద్యార్థులకు పరీక్షలు చేశామన్నారు. వీరిలో మెరుగైన వైద్యం ఐదుగురికి అవసరం కాగా వారిని ఏలూరు తరలిస్తున్నట్లు పేర్కొన్నారు.

అకాల వర్షం.. అన్నదాతకు కష్టం

- గాలి వాన బీభత్సంతో రైతులకు అవస్థలు
- వర్షంబారిన ధాన్యం, మొక్కజొన్న రాశులు
- ధాన్యం కొనుగోళ్ల తీరుపై రైతుల ఆగ్రహం



ధాన్యం రాశులను పరదాలతో కప్పిన రైతులు



వర్షంతో తడిసిన మొక్కజొన్న



వల్లూరుపాలెంలో వర్షానికి తడిసిన ధాన్యం బస్తాలు

తోట్లవల్లూరు: అకాల వర్షం అన్నదాతకు కష్టాలను తెచ్చిపెడుతోంది. పంట చేతికందే సమయంలో కురుస్తున్న వర్షం కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. కల్లాల్లో ఆరబెట్టిన ధాన్యం, మొక్కజొన్న అకాల వర్షాలకు ఏమౌతుందోనని రైతులుకలవరపడుతున్నారు. వివరాల్లోకి వెళితే.. తోట్లవల్లూరు మండలంలోని రొయ్యూరు, చిన పులిపాక, బొడ్డపాడు, వల్లూరుపాలెం గ్రామాల్లో రైతులు దాళ్వాను సాగు చేశారు. వ్యవసాయ శాఖ అంచనా ప్రకారం సుమారు 1,100 ఎకరాల్లో దాళ్వా పంట సాగైంది. అలాగే కరకట్ట వెంబడి రొయ్యూరు, వల్లూరుపాలెం, తోట్లవల్లూరు, భద్రిరాజుపాలెం, పాములలంక, చాగంటిపాడు, కళ్లంవారిపాలెం, దేవరపల్లి, గురివిందపల్లి, ఐలూరు తదితర గ్రామాల పరిధిలోని లంకల్లో సుమారు నాలుగు వేల ఎకరాల్లో మొక్కజొన్న పంటను రైతులు సాగు చేశారు.

వర్షంతో కుదేలు..

వాతావరణంలో వస్తున్న అనూహ్య మార్పులతో రైతులు ఆందోళన చెందుతున్నారు. అప్పటి వరకు బాగా ఎండ ఉండి, మంగళవారం మధ్యాహ్నం ఆకాశం మబ్బులు కమ్మి ఈదురుగాలులతో కూడిన వర్షం కురియడంతో రైతులు కలవరపడ్డారు. వల్లూరుపాలెం, రొయ్యూరు గ్రామాల పరిధిలో ధాన్యం యంత్రాలతో నూర్పిడి చేసి కల్లాల్లో ఆరబెట్టి ఉంది. అలాగే లంకల్లో మొక్కజొన్న నూర్పిడి చేసి రైతులు కల్లాల్లో ఆరబెట్టి ఉంచారు. ఈదురుగాలులు, అకాల వర్షంతో ఆయా పంటలను కాపాడుకోలేక నానా అవస్థలు పడ్డారు.

ధాన్యం కొనుగోలులో నిర్లక్ష్యం..

ధాన్యం నూర్పిడి చేసి రోజులు గడుస్తున్నా కొనుగోళ్లు జరగక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. వల్లూరుపాలెం బీసీ సొసైటీలో పదుల సంఖ్యలో రైతులు ధాన్యాన్ని ఆరబెట్టి అమ్ముకోవటానికి ప్రయత్నిస్తున్నారు. అయితే రైతు సేవా కేంద్రం సిబ్బంది రైతులకు సహకరించకపోవటం, సకాలంలో గోనె సంచులు ఇవ్వకపోవటంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ధాన్యం రాశులకు పరదాలు కప్పి సంచుల కోసం ఎదురు చూస్తున్నారు. ధాన్యం కొనుగోలులో వ్యవసాయ సిబ్బంది అనుసరిస్తున్న తీరుపై రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

గోనె సంచులు ఇవ్వటం లేదు



ఎకరం పొలంలో వరి సాగు చేశాను. యంత్రం ద్వారా ధాన్యం నూర్పిడి చేసి వారం రోజులు గడిచింది. రైతు సేవా కేంద్రం సిబ్బంది ఇంత వరకు గోనె సంచులు ఇవ్వలేదు. వర్షంతో పంట ఏమౌతుందోనని ఆందోళనగా ఉంది.

– నాగదేశి కోటేశ్వరరావు, రైతు, వల్లూరుపాలెం

కల్లంలోనే ధాన్యం



దాళ్వా సాగులో భాగంగా రెండు ఎకరాల్లో వరి సాగు చేశాను. పంటను నూర్పిడి చేసి 14 రోజులు అయ్యింది. ఇంత వరకు రైతు సేవా కేంద్రం సిబ్బంది ధాన్యం కొనుగోలు చేయలేదు. ఎన్ని సార్లు తిరిగినా కనీసం సమాధానం కూడా చెప్పటం లేదు.

– తుమాటి సాల్మన్‌రాజు, రైతు, వల్లూరుపాలెం

వర్షమే అడ్డంకి



ధాన్యం కొనుగోళ్లకు ఎలాంటి ఇబ్బందులు లేవు. ధాన్యం ఎగుమతులకు వర్షమే అడ్డంకిగా మారింది. ధాన్యం కూడా తేమకు గురవుతుండటంతో తేమ శాతాన్ని పరిగణనలోకి తీసుకోవాల్సి వస్తోంది. ధాన్యం లోడింగ్ కోసం వచ్చిన లారీలు కూడా వర్షం కారణంగా వెనుకకు వెళ్లిపోయాయి.

– జి. నాగేశ్వరరావు, మండల వ్యవసాయాధికారి, తోట్లవల్లూరు

వేంకటేశ్వరుని బ్రహ్మోత్సవాలు ప్రారంభం

ముదినేపల్లి రూరల్: మండలంలోని ఊటుకూరు శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా స్వామికి పంచామృతాభిషేకం, నవకలశస్నపన కార్యక్రమాలు నిర్వహించి అనంతరం స్వామిని పెండ్లి కుమారుడిగా ముస్తాబు చేశారు. బుధవారం స్వామి, అమ్మవార్ల తిరుకల్యాణోత్సవం, గ్రామోత్సవం నిర్వహిస్తామని ధర్మకర్తలు తెలిపారు. చివరి రోజు గురువారం స్వామికి శ్రీచక్రస్నానం, వసంతోత్సవం, పవళింపు సేవ జరుపుతామని పేర్కొన్నారు.

నేడు అమ్మవారి జన్మదిన వేడుకలు

గుడివాడ టౌన్: స్థానిక వాసవి చౌక్‌లోని శ్రీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో బుధవారం అమ్మవారి జన్మదిన మహోత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ అధ్యక్షుడు జవ్వాజి గంగరాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటలకు పతాక ఆవిష్కరణ, అమ్మవారికి పట్టుచీర సమర్పణ, 102 మంది బాలకన్యకల విశేష పూజలు, సామూహిక కుంకుమ పూజలు, సాయంత్రం 5 గంటలకు అమ్మవారి నగరోత్సవం ఘనంగా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

ప్రజల సమస్యలు వెంటనే పరిష్కరించండి

గుడివాడ టౌన్: ప్రజలకు ప్రధాన సమస్య అయిన మురుగునీటి పారుదల, వాతావరణ కాలుష్యం తదితర సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అధికారులకు సూచించారు. మంగళవారం పట్టణంలోని 7వ వార్డులో మీకోసం వెనిగండ్ల కార్యక్రమంలో భాగంగా పర్యటించారు. మున్సిపల్ కమిషనర్ ఎస్. మనోహర్‌తో కలిసి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. ప్రత్యేకించి మార్కెట్ సెంటర్‌లోని చింతల కాల్వ డ్రెయిన్‌లో వ్యర్థాలు పేరుకుపోవడం, మురుగునీరు నిల్వ ఉండటం సమస్యగా మారిందని ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. స్పందించిన ఎమ్మెల్యే ఇందుకు కావాల్సిన సిబ్బందిని కేటాయించి తక్షణమే సమస్య పరిష్కారానికి కృషి చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ పి. శ్రీనివాసరావు, డీఈ సతీష్‌చంద్ర, ఏఈ రాజేష్ పాల్గొన్నారు.

నేడు పారిశ్రామిక పార్కు ఏర్పాటుకు భూమిపూజ

ఐనంపూడి(పామర్రు): మండలంలోని ఐనంపూడి గ్రామంలో బుధవారం ఉదయం పారిశ్రామిక పార్కు ఏర్పాటుకు భూమి పూజ చేయనున్నట్లు తహసీల్దార్ జి.రవికాంత్ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో పరిశ్రమల స్థాపన కోసం మిగులు భూములను గుర్తించి నివేదిక పంపాలని ప్రభుత్వం ఇటీవల తహసీల్దార్లను ఆదేశించిందని పేర్కొన్నారు. ఈ క్రమంలో పామర్రు మండలంలో 10.50 ఎకరాలు మిగులు భూమి ఉన్నట్లు గుర్తించి జిల్లా కలెక్టర్‌కు నివేదిక పంపినట్లు తెలిపారు.

తోట్లవల్లూరులో భారీ వర్షం



తోట్లవల్లూరు మెయిన్‌రోడ్డుపై నిలిచిన వర్షం నీరు

తోట్లవల్లూరు: తోట్లవల్లూరులో భారీ వర్షం కురిసింది. మంగళవారం ఉదయం నుంచి ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నప్పటికీ, మధ్యాహ్నానికి ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. ఆకాశం మేఘావృతమై ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం సుమారు గంటపాటు కురిసింది. భారీ వర్షంతో గ్రామంలోని ప్రధాన రహదారులు బురదకయ్యలుగా మారాయి. స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద మోకాలి లోతులో వర్షం నీరు నిలిచిపోవటంతో వాహనదారులు ఇబ్బందులకు గురయ్యారు. అలాగే ప్రధాన రహదారి కూడా బురదమయంగా మారటంతో ప్రజలకు అవస్థలు తప్పలేదు. ప్రధాన రహదారిపై నీరు నిలువకుండా గ్రామ పంచాయతీ చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

వీరాంజనేయస్వామికి ప్రత్యేక పూజలు



వీరాంజనేయస్వామికి పూజలు చేస్తున్న భక్తులు

పామర్రు: ఉండ్రపూడి–పోలవరం అడ్డరోడ్డు వద్ద ఉన్న వీరాంజనేయస్వామి ఆలయంలో వైశాఖ మాసం మంగళవారం కావడంతో ఆలయంలో భక్తుల తాకిడి ఎక్కువైంది. స్వామికి ప్రత్యేకంగా అభిషేకాలను చేసి అనంతరం తమల పాకులు, వడ మాలలతో, నాగ వల్లీ దండలతో పూజాకార్యక్రమాలను నిర్వహించారు. ఆలయంలో భక్తులు పాల పొంగళ్లను స్వయంగా వండి స్వామికి నివేదించి మొక్కులను తీర్చుకున్నారు. ఆలయ అర్చకులు ఏ దినకర్ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించినట్లు ఈఓ ప్రసాదరావు తెలిపారు.

మహిమాన్వితుడు మల్లేశ్వరుడు

నేటి నుంచి 12 వరకు స్వామివారి బ్రహ్మోత్సవాలు



శ్రీభ్రమరాంబ సమేత చెన్న మల్లేశ్వరస్వామి వారు

ఎలకుర్రు(పామర్రు): కోరుకున్న వారికి కొంగు బంగారమై భక్తుల కోర్కెలను తీరుస్తున్న కరుణా సముద్రుడు భ్రమరాంబ సమేత చెన్న మల్లేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ఈ నెల 7 నుంచి 12వ తేదీ వరకు నిర్వహించనున్నారు. రెండు శతాబ్దాలకు పైబడి భక్తులతో పూజలు అందుకుంటూ గ్రామస్తుల ఇలవేల్పుగా కొలువై ఉన్నారు. పామర్రు మండలం ఎలకుర్రు గ్రామంలో వేంచేసియున్న శ్రీభ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి ఆలయానికి 264 ఏళ్ల పైబడి చరిత్ర ఉంది.

1760లో ఆలయ నిర్మాణం

శివదీక్షా పరుడు, చల్లపల్లి, గురజ జమీందారీ ఆస్థానాల్లో ఆగమ సలహాదారులుగా ఉంటూ జమీందారులకు గురువుగా శివదీక్షను ప్రసాదించి వారిచే ఎలకుర్రు, శోభనాద్రిపురం, మల్లేశ్వరం గ్రామాలను బహుమతిగా పొందారు కాశీనాథుని వంశస్తులైన కాశీనాథుని చిన వీర నారాధ్యులు. ఈయన ఆధ్వర్యంలో 1760 సంవత్సరంలో ఎలకుర్రు గ్రామంలో భ్రమరాంబ సమేత చెన్న మల్లేశ్వరస్వామి ఆలయాన్ని నిర్మించారు. ఆ నాటి నుంచి కాశీనాథుని వంశస్తులతో ఆలయంలో ధూప దీప నైవేద్యాలతో ఆలయం విరాజిల్లుతోంది.

భక్తుల కొంగు బంగారం..

భక్తుల కోరిన కోర్కెలు తీర్చుతూ కోరిన వారికి కొంగు బంగారమై స్వామి భక్తులకు ఇలవేల్పుగా ఉన్నారు. వీరి వంశంలో జన్మించిన వారు విశ్వదాత, దివంగత దేశోద్ధారక కాశీనాథుని నాగేశ్వరరావు పంతులుగారు . వీరితో పాటు ప్రముఖ సినీ దర్శకుడు, నటుడు దివంగత కాశీనాథుని విశ్వనాథ్(కె.విశ్వనాథ్) ఈ వంశానికి చెందిన వారే. ఆ నాటి నుంచి నేటి వరకూ ఆలయంలో నిత్యం ధూప దీప నైవేద్యాలను నిర్వహిస్తూ, పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఆలయానికి ప్రతి ఏటా నూతన శోభను కాశీనాథుని వంశం వారు సంతరిస్తూ ఆలయాన్ని నిర్వహిస్తున్నారు. నిత్యం శివనామస్మరణతో విరాజిల్లుతున్న ఈ ఆలయంలోని స్వామి వారి దయతో జన్మించిన పిల్లలకు గ్రామస్తులు స్వామివారి పేర్లు పెట్టి తరిస్తున్నారు. ప్రతి సంవత్సరం వైశాఖ మాస ఏకాదశి నుంచి పౌర్ణమి వరకూ గ్రామంలోని ఆలయంలో స్వామి బ్రహ్మోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. రాష్ట్ర నలు మూలల నుంచి వేల మంది భక్తులు బ్రహ్మోత్సవాల్లో పాల్గొని తమ మొక్కులను తీర్చుకుంటున్నారు.

నేడు ధ్వజారోహణం

ఈ నెల 7 నుంచి 12 వ తేదీ వరకు ఆలయ వార్షిక కల్యాణ మహోత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఆలయ వ్యవస్థాపక కుటుంబ ధర్మకర్త కాశీనాథుని నాగేశ్వరరావు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ బుధవారం ధ్వజారోహణం, 8న వేద పఠనం, సహస్రనామార్చన, హరికథా కాలక్షేపాలు, రాత్రి 7 గంటలకు విశ్వదాత అవార్డుల ప్రదానోత్సవం, నాట్య ప్రదర్శనలు ఉంటాయని పేర్కొన్నారు. ఈ నెల 9 న మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం , హరికథా కాలక్షేపం, రాత్రి 9 గంటలకు వేదాంతం రాధేశ్యామ్ బృందం వారి భామా కలాపం ఉంటుందని తెలిపారు. ఈ నెల 10న వేదపఠనం, రాత్రి 7 గంటలకు జగజ్యోతి, రాత్రి 9 గంటలకు బాల సరస్వతీ నాట్యమండలి జన్ను నారాయణరావు సమర్పించు సత్యహరిశ్చంద్రనాటకం ఉంటుందని పేర్కొన్నారు. అదే రోజు రాత్రి రెండు గంటలకు స్వామివారి కల్యాణ మహోత్సవం జరుగుతుందన్నారు. 11న 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు హరికథా కాలక్షేపాలు ఉంటాయని తెలిపారు. రాత్రి 9 నుంచి ఎలకుర్రు కాశీనాథుని వారిచే వీరభద్రస్వామి వీధిపళ్లెం కార్యక్రమం అనంతరం రాత్రి 10 గంటలకు స్వామి రథోత్సవం ఉంటుందని పేర్కొన్నారు. 12న స్వామివారి త్రిశూల స్నానం, రాత్రికి ఏకాదశ ప్రదక్షిణలు, పవళింపుసేవ అనంతరం మహా అన్న సమారాధన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో గ్రామస్తులతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలు, భక్తులు పాల్గొని స్వామి కృపకు పాత్రులు కాగలరని నాగేశ్వరరావు కోరారు.

కిశోర బాలికలకు అవగాహన

గుడ్లవల్లేరు: కిశోర బాలికలకు కౌతవరం, విన్నకోట అంగన్‌వాడీ కేంద్రాల్లో అవగాహన సదస్సులను ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వాణి మంగళవారం నిర్వహించారు. కిశోర వికాసంపై వేసవి శిక్షణ తరగతులను చేపట్టి కిశోర బాలికల వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన పరిచారు. అలాగే గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై విద్యార్థినులకు వివరించారు. జూన్ 10వ తేదీ వరకు నిర్వహించే ఈ వేసవి శిక్షణ తరగతులను వినియోగించుకోవాలని సూపర్‌వైజర్ కోరారు.

తోట్లవల్లూరులో..

తోట్లవల్లూరు: పరిసరాల శుభ్రతలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగమల్లేశ్వరి సూచించారు. స్థానిక ఎస్టీ ఏరియా అంగన్‌వాడీ కేంద్రంలో కిశోర వికాశంపై మంగళవారం అవగాహన కార్యక్రమం జరిగింది. కిశోర బాలికలు తీసుకోవాల్సిన ఆహార జాగ్రత్తలు, బాల్య వివాహాలు, పరిసరాల పరిశుభ్రత వంటి అంశాలపై నాగమల్లేశ్వరి అవగాహన కల్పించారు. ఎంఎస్‌కే శిరీషా, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

నందివాడలో..

నందివాడ: విద్యార్థినులు చిన్నప్పటి నుంచే పరిసరాల శుభ్రత, లైంగిక విద్యపై అవగాహన కలిగి ఉండాలని డీసీపీఓ కౌన్సిలర్ జే స్వరాజ్యం అన్నారు. మండలంలోని పుట్టగుంట గ్రామంలో కిశోర వికాసం వేసవి సెలవుల శిక్షణ కార్యక్రమంలో భాగంగా బాలికలకు స్థానిక అంగన్‌వాడీ కేంద్రాల్లో అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ నాగ శిరీష, తేజశ్రీ, ఏఎన్‌ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మతాలు కాదు.. దేశభక్తి ప్రామాణికం

కైకలూరు: దేశంలో మతాలు కాదని, దేశభక్తి ప్రమాణికంగా భావించాలని ఎంపీ అభ్యర్థి పాకా వెంకట సత్యనారాయణ స్పష్టం చేశారు. వక్ఫ్ చట్టం – 2025పై కైకలూరు షణ్ముక మినీ ఫంక్షన్ హాల్లో ఏలూరు జిల్లా బీజేపీ ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన ప్రజా అవగాహన సదస్సులో ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడారు. వక్ఫ్ చట్టం ద్వారా వచ్చే ఆస్తుల ఆదాయంతో దేశంలో పేద ముస్లిందరికీ సంక్షేమ పథకాలు అమలు చేయవచ్చన్నారు. బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి పెద్దిరెడ్డి కిరణ్, మాజీ ఎమ్మెల్యే అంబికా కృష్ణ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు విక్రమ్ కిషోర్ పాల్గొన్నారు.

సృజనాత్మక శక్తిని వెలికి తీసేందుకే విజ్ఞాన శిబిరాలు



అంగలూరులో నిర్వహించిన చిత్ర లేఖనం పోటీల్లో విద్యార్థులు



మండవల్లి గ్రంథాలయంలో పిల్లలతో దినపత్రిక చదివిస్తున్న దృశ్యం



ముదినేపల్లిలో విద్యార్థులకు గణితం బోధిస్తున్న అధ్యాపకుడు



జమీగొల్వేపల్లిలో నిర్వహించిన వేసవి విజ్ఞాన శిబిరంలో పాల్గొన్న విద్యార్థులు

గుడ్లవల్లేరు: విద్యార్థుల్లో సృజనాత్మక శక్తిని వెలికి తీసేందుకే వేసవి విజ్ఞాన శిబిరాల నిర్వహిస్తున్నట్లు గుడ్లవల్లేరు గ్రంథాలయాధికారులు పి.వి.వి.పద్మజ, వాణి పేర్కొన్నారు. మంగళవారం వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా విద్యార్థులకు ఆటలు, చిత్ర లేఖనం పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారులు మాట్లాడుతూ ఆటపాటలతో విద్యార్థుల్లో దేహ దారుఢ్యం , మానసిక ఉల్లాసం ఏర్పడుతుందన్నారు.

గణితంపై పట్టు సాధించాలి

ముదినేపల్లి రూరల్: ప్రాథమిక స్థాయిలో విద్యార్థులు గణితంపై పట్టు సాధిస్తే విద్యలో ఉన్నత శిఖరాలు చేరుకోవచ్చునని అధ్యాపకుడు కె.నాగరాజు అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా విద్యార్థులకు మంగళవారం గణితంలో పాటించాల్సిన మెలకువల గురించి అధ్యాపకుడు వివరించారు. గణితంపై భయపడాల్సిన పనిలేదని తెలిపారు. లైబ్రేరియన్ ఎం.శ్రీదేవి పంచతంత్ర కథలు బోధించారు.

మండవల్లిలో..

మండవల్లి: గ్రంథాలయంలో పుస్తక పఠనంతో పాటు, దినపత్రికలు చదవడం అలవాటు చేసుకోవాలని గ్రంథాలయాధికారి ఎస్‌కే పర్వీన పేర్కొన్నారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా మంగళవారం ఆమె మాట్లాడుతూ దినపత్రికలు చదవడం వలన కరెంట్ అఫైర్స్‌లో పట్టు సాధించవచ్చన్నారు. అనంతరం శిబిరానికి హాజరైన పిల్లలతో దినపత్రికలు చదివించారు.

వ్యక్తిత్వ వికాసంపై అవగాహన

జమీగొల్వేపల్లి(పామర్రు): విద్యార్థులకు పొడుపు కథలు–తెలుగు సామెతలు, వ్యక్తిత్వ వికాసంపై అవగాహన తరగతులను నిర్వహించామని గ్రంథాలయ అధికారి నాగసురేష్ తెలిపారు. మండలంలోని జమీగొల్వేపల్లి శాఖా గ్రంథాలయంలోని విజ్ఞాన శిబిరంలో మంగళవారం అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొడుపు కథలతో చిన్నారులలో సృజనాత్మకత పెరుగుతుందన్నారు. విద్యార్థులు తోటివారితో స్నేహ పూర్వకంగా మెలగాలన్నారు. కార్యక్రమంలో కొల్లి నాయుడమ్మ, పొట్లూరి వెంకట ధర్మారావు పాల్గొన్నారు.

పామర్రులో..

స్థానిక ద్వితీయ శ్రేణి గ్రంథాలయంలో విద్యార్థులతో చెస్, క్యారమ్స్ ఆడించినట్లు గ్రంథాలయ అధికారి ఎం.ఝాన్సీరాణి పేర్కొన్నారు.

ఉచిత వైద్య పరీక్షలు



కలిదిండి(కైకలూరు): కోరుకొల్లు క్రాంతి హైస్కూల్లో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వర్రే జగన్నాథం చారిటబుల్ ట్రస్ట్, క్రాంతి హైస్కూల్ కరస్పాండెంట్, వాకర్స్ క్లబ్ ప్రెసిడెంట్ చెన్నంశెట్టి కృష్ణ, గుడివాడ లయన్స్ క్లబ్, విజయవాడ అను గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో 550 మంది ఉచిత వైద్య పరీక్షలు చేయించుకున్నారు. అను గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ వైద్యులు వైద్యసేవలు అందించారు. శిబిరంలో గుర్తించిన కంటి సమస్యలపై శస్త్ర చికిత్సలు గుడివాడ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో చేయించనున్నారు. వర్రే వెంకట సత్యనారాయణ ఆర్థిక సాయంతో ఉచిత కళ్లజోళ్లను క్రాంతి స్కూల్లో ఈ నెల 12న అందించనున్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ కృష్ణా జిల్లా ఫౌండర్ గవర్నర్ సనక సుబ్బారావు, వాకర్స్ ఇంటర్నేషనల్, క్యాబినెట్ జాయింట్ సెక్రెటరీ అజ్జ ప్రసాద్, కోరుకొల్లు వాకర్స్ క్లబ్ కార్యదర్శి గొర్తి వెంకట కృష్ణ కుమారి తదితరులు పాల్గొన్నారు.